క్లుప్తంగా

స్వర్ణ కిరీటానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక డీసీసీబీ కాలనీలో వేంజేసిన భూ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కొలువైన వేంకటేశ్వరస్వామికి బంగారు కిరీటం చేయించే నిమిత్తం ఉప్పల ఉమామహేష్, లక్ష్మీ దంపతులు రూ.లక్ష విరాళంగా సమర్పించారని ఆలయ అర్చకులు గోపాలాచార్యులు తెలిపారు.

ఉద్యోగాల పేరుతో మోసపోవద్దు



మాట్లాడుతున్న ఎస్ఐ మధుసూదనరావు

జి.సిగడాం: గ్రామీణ ప్రాంతాల్లోని యువత ఉద్యోగాల పేరుతో మోసపోవద్దని ఎస్ఐ మధుసూదనరావు సూచించారు. స్థానిక స్టేషన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ చదువు మధ్యలో నిలుపుదల చేసి అనేక మంది దళారుల చేతిలో మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పలువురు బాలికలు అవగాహన లేకపోవడంతో అనేక ఇబ్బందుల్లో చిక్కుకుంటున్నారని పేర్కొన్నారు. ఇలాంటి బాలికల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. బాలికల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సదుపాయాలు తీసుకొస్తున్నాయని పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే సమాచారం అందించాలని కోరారు.

గురుకులాన్ని అభివృద్ధి చేద్దాం



సాంప్రదాయ గురుకులాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: సంప్రదాయ గురుకులాన్ని మరింత అభివృద్ధి చేద్దామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. మండల పరిధిలోని కల్లేపల్లి గ్రామంలో ఉన్న సంప్రదాయ గురుకులాన్ని ఆయన శనివారం పరిశీలించారు. కార్పస్ ఫండ్‌ను సేకరించి సాంప్రదాయ గురుకులాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో నృత్య కళాశాల ప్రిన్సిపాల్ స్వాతీ సోమనాథ్, ఎంపీడీవో శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నమ్మాళ్వార్ పరమ పదోత్సవం



నమ్మాళ్వార్ పరమపదోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కోదండ రామాలయంలో నమ్మాళ్వార్ పరమ పదోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో భక్తులంతా కలిసి గత ఐదు రోజులుగా నమ్మాళ్వార్ అధ్యయనోత్సవం నిర్వహించారు. అనంతరం పూజలు చేసి, తీర్థప్రసాదాలను అందించారు.

రేపటి నుంచి పశు ఆరోగ్య శిబిరాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం: ఈనెల 20వ తేదీ నుంచి 31 వరకు ప్రతీ గ్రామంలో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు తెలిపారు. ఉచిత ఆరోగ్య శిబిరాల పోస్టర్‌ను మండలంలోని బంటుపల్లిలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పాడి పశువులకు, జీవాలకు ఉచితంగా వ్యాధి నివారణ టీకాలు, నట్టల నివారణ మందులతో పాటు గర్భకోశ వ్యాధుల చికిత్స చేయడం జరుగుతుందన్నారు. పాడి రైతులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం నగరంలోని ఖాజీపేట కాలనీ గెడ్డ గట్టు వద్ద ఎనిమిది మంది, వాంబేకాలనీ రాజీవ్ గృహకల్ప సమీపంలో మరో ఐదుగురు పేకాట ఆడు తూ శనివారం పట్టుబడ్డారు. టాస్క్‌ఫోర్సు అధికారులతో కలసి ఒకటో పట్టణ ఎస్ఐ ఎం.హరికృష్ణ వీరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.13,925లు నగదును స్వాధీనం చేసుకున్నారు. అయితే రాజీవ్‌గృహకల్ప వద్ద జరిగిన పేకాటకు సంబంధించి ఓ కానిస్టేబుల్ (ప్రత్యేక విభాగం) ప్రమేయమున్నట్లు నగరంలో ప్రచారం నడుస్తోంది.

గార: మండలంలోని బూరవెల్లిలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నామని, వారి వద్ద నుంచి రూ.3,850లు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ ఆర్.జనార్ధన తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.



కాలనీ రోడ్డుపై గుంపులుగా కుక్కలు

- శ్రీకాకుళంలో కుక్కల స్వైరవిహారం
- బెంబేలెత్తిపోతున్న ప్రజలు
- అధికారులు చర్యలు తీసుకోవాలని విన్నపం

భౌ బోయ్..!

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నగరంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రతీ సెంటర్‌లో గుంపులు, గుంపులుగా విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. దారినపోయే మనుషులు, వాహనాలపై అరుస్తూ వెంటబడుతున్నాయి. గతంలో కుక్కల బెడదపై స్థానికులు ఫిర్యాదులు చేశారు. దీంతో మున్సిపాలిటీ అధికారులు కుక్కలను కాంట్రాక్టుపై ఒక ప్రైవేటు కంపెనీకి అప్పగించి, కుక్కలకు కేవలం ఆపరేషన్ చేసి ఒకే చోట వదిలేశారు. దీంతో అక్కడ ఉన్న సెంటర్‌లోనే అవి మళ్లీ గుంపులుగా చేరి సంచరిస్తున్నాయి. దీనివలన పాదచారులకు, రాత్రిపూట వచ్చేవారికి ఇబ్బందికరంగా తయారయ్యాయి.

గుంపులుగా చేరి...

నగరంలోని పలు కేంద్రాల్లో ఇప్పుడు కొత్తగా ఒకేచోట గుంపులుగా కుక్కలు చేరి ఉన్నాయి. వాటిని కొడితే మరో కుక్క తమపైకి వస్తుందేమోనని స్థానికులు భయపడుతున్నారు. పీఎన్ కాలనీ, బలగ, ఇప్పిలి వీధి, ఏడురోడ్ల కూడలి, డే అండ్ నైట్, సూర్యమహల్ కూడలి, జిల్లా పరిషత్ వెనుక ఉన్న హౌసింగ్ బోర్డు కాలనీ, జెడ్పీ ఎదురుగా ఉన్న హౌసింగ్ బోర్డు కాలనీ, కలెక్టర్ కార్యాలయం రోడ్డు తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద చాలా ఎక్కువగా ఉంది. రాత్రి సమయంలో అయితే వీటి సంచారం మరీ ఎక్కువగా ఉంది. అలాగే చాలామంది ఉదయాన్నే కాలనీల రోడ్లపై నడక సాగిస్తుండగా వారిపై సైతం దాడులకు తెగబడుతున్నాయి. స్కూళ్లకు, ఆఫీసులకు వెళ్లే పాదచారులను, సైకిల్స్‌పై, మోటారు వాహనాలపై వెళ్లేవాళ్లను కూడా వెంబడిస్తున్నాయి. కొంతమంది పాదచారులు తమతో పాటు కర్రలను పట్టుకొని వెళ్తున్నారు. అదేవిధంగా షాపులు కట్టి ఇంటికి వెళ్లేవారు, నైట్ డ్యూటీలు చేసేవాళ్లకు, సినిమాలకు వెళ్లి వచ్చే వాళ్లకి వీటి సమస్య ఎక్కువే. ఒక్కొక్క ప్రాంతానికి కొన్ని కుక్కలు స్థావరంగా ఏర్పడి అక్కడికి వచ్చేవారిని వెంటాడుతున్నాయి.

సమస్య ఎక్కువగా ఉంది



కుక్కల సమస్య మా ప్రాంతంలో ఎక్కువగా ఉంది. మేము షాపులు నుంచి ఇంటికి వెళ్లేసరికి రాత్రి 12 అవుతుంది. ఆ సమయంలో కుక్కలు వెంటబడుతున్నాయి. మేము వస్తున్న దారిలో ఎక్కడ చూసినా కుక్కలు ఎక్కువగా ఉన్నాయి. వీటిని పట్టుకొని వెళ్లి ఎక్కడో దూరంగా వదిలేస్తే మంచిది.

– డబ్బీరు మోహనరావు, హౌసింగ్ బోర్డు కాలనీ, శ్రీకాకుళం

కాంప్లెక్స్ పరిశుభ్రత అందరి బాధ్యత



స్వచ్ఛ భారత్ చేస్తున్న ఆర్టీసీ అధికారులు, సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేటట్లు చూసే బాధ్యత ఆర్టీసీ అధికారులు, సిబ్బందిపై ఉందని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కేఆర్ఎస్ శర్మలు అన్నారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఆర్టీసీ అధికారులు, సిబ్బంది చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజూ ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వేలమంది ప్రయాణికులు వస్తుంటారని, వారంతా కాంప్లెక్స్‌లో తిరిగేటపుడు చెత్త, చెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా డస్ట్‌బిన్‌లో వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రయాణికులు పొరపాటున ప్లాస్టిక్ కవర్లు, తినుబండారాల కవర్లు, వాటర్ బాటిల్స్, కూల్‌డ్రింక్ బాటిల్స్ వంటివి పడేసినట్లైతే వాటిని ఆర్టీసీ పారిశుద్ధ్య కార్మికులు తీసివేసి డస్ట్‌బిన్‌లో వేసి పరిశుభ్రం చేయాలన్నారు. కాంప్లెక్స్ పరిశుభ్రత మనందరి బాధ్యతగా గుర్తించి అందుకు అనుగుణంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, ఆర్టీసీ ఎస్ఎం ఎంపీ రావు, ఆర్టీసీ అధికారులు ఎల్ఎస్ నాయుడు, ప్రసాద్, రాజు, ఆర్టీసీ సెక్యూరిటీ, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వక్తలు సూచించారు. జిల్లావ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశంతో స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ప్రతి నెలా మూడో శనివారం ఈ కార్యక్రమం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అన్ని గ్రామాల్లో ఆయా పరిధిలోని అధికారులు, సిబ్బంది అవగాహన ర్యాలీలు చేపట్టి, పరిసరాలను పరిశుభ్రం చేశారు.

- సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం పాతబస్టాండ్: సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎస్‌వో సూర్యప్రకాష్

వైభవంగా దుర్గాదేవి జాతర

జి.సిగడాం: మండలంలోని మదుపాం గ్రామంలో దుర్గాదేవి జాతర మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ వై.మధుసూధనరావు భారీ బందోబస్తుతో యాత్ర చేపట్టారు. సుదూరు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక వసతులు కల్పించారు. భక్తులు తరలివచ్చి అమ్మవారికి ముడుపులు, మొక్కులు సమర్పించారు.



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

23న గణపతి సచ్చిదానంద స్వామిజీ రాక

శ్రీకాకుళం కల్చరల్: దత్త పీఠాధిపతులు గణపతి సచ్చిదానంద స్వామిజీ, దత్తపీఠ ఉత్తరాధిపతి దత్త విజయానంద తీర్థ స్వామిజీలు ఈనెల 23, 24 తేదీల్లో శ్రీకాకుళం చిందత్త క్షేత్రానికి విచ్చేస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. దీనిలో భాగంగా 23న మహా గణపతి హోమం, నూతన యాగశాల, కళావేదిక ప్రాంగణాల ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. అనంతరం స్వామీజీ అనుగ్రహ భాషణ, 24న శ్రీచక్రార్చన, దత్తహోమం, పూర్ణాహుతి నిర్వహించి భక్తులకు మహాదర్శనం, అనుగ్రహభాషణ ఉంటుందని తెలిపారు. భక్తులంతా పాల్గొనాలని కోరారు.

అధ్యక్షుడిగా సాయిరాం



బోర సాయిరాం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా అజ్జరాం గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, డీసీఎంఎస్ ఉపాధ్యక్షుడు బోర సాయిరాంను నియమిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి, గ్రామస్థాయి ప్రజా ప్రతినిధులు, నాయకుల అభిప్రాయాలను సేకరించి నియామకం చేపట్టినట్లు తెలిపారు. స్థానిక ఎన్నికలకు నాయకులు సన్నద్ధం కావాలని, పార్టీని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని క్యాడర్‌కు సూచించారు. గ్రామాల యూనిట్‌గా పార్టీ బలోపేతంపై దృష్టిపెడుతున్నట్లు తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన

ఎచ్చెర్ల క్యాంపస్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా ఎచ్చెర్లలోని డ్రైవింగ్ ట్రాక్ వద్ద శనివారం డ్రైవింగ్ లైసెన్స్‌కు వచ్చిన వారికి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పి.వి.గంగాధర్‌రావు, ఆర్.అనిల్, కె.శిరీష అవగాహన కల్పించారు. హెల్మెట్ వినియోగించాలని, ట్రిపుల్ రైడింగ్ వద్దని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. డ్రైవింగ్‌లో ఏకాగ్రత కీలకమని పేర్కొన్నారు. అతివేగం ప్రమాదాలకు దారితీస్తుందన్నారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించని వాహన చోదకులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఒక రోడ్డుకు ఒకటే ఐడీ



ఉపాధి హామీ ప్రజావేదిక నిర్వహిస్తున్న దృశ్యం

- పని నమోదుపై నిబంధనలు పాటించాల్సిందే
- డ్వామా పీడీ సుధాకరరావు

గార: ఒక రోడ్డు నిర్మాణంలో ఒకే ఐడీతో మాత్రమే పనిచేయాలని, ఎక్కువ ఐడీలు నమోదు చేయవద్దని డ్వామా పీడీ బి.సుధాకరరావు స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక శనివారం జరిగింది. దీనిలో భాగంగా పంచాయతీల వారీగా మస్టర్లు నమోదులో దిద్దుబాట్లుపై పలు సూచనలు చేస్తున్నా అలసత్వం వహిస్తున్న ఫీల్డు అసిస్టెంట్లకు అపరాధ రుసుము విధించారు. అదేవిధంగా చెరువు పనుల కొలతల్లో తేడా, టాస్క్ డీపీయేషన్ అంశాలు గుర్తించారు. దీనిపై టెక్నికల్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని సూచించారు. ప్రతీ అంశం నోటి ద్వారా కాకుండా కాగితాలపై నమోదు చేయాలన్నారు. ఆన్‌లైన్ మస్టర్ (డీ–మస్టర్) ఎప్పుడు ఉపయోగించారో నమోదు చేయని వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలన్నారు. వేతనదారులకు అవగాహన కోసం జాతీయ రోజ్‌గార్ దివస్ మూడో శుక్రవారం జరగాల్సి ఉన్నా, ప్రతీ శుక్రవారం అవగాహన కల్పించడంలో తప్పులేదన్నారు. జీజీఐ పారామీటర్లు అమలుకాకపోవడం దురదృష్టకరమన్నారు. మొక్కలు చనిపోవడం, బోర్డులు పెట్టకపోవడం వంటి అంశాలు గుర్తింపు ఉండడంపై క్షేత్రస్థాయిలో సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, ఏపీడీలు పంచాది రాధ, కె.లోకేశ్వరరావు, విజిలెన్స్ అధికారి శ్రావణ్, ఎంపీడీవో శిమ్మ రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కొంపముంచిన సరదా వ్యాఖ్యలు

ఉపాధి ప్రజావేదికలో గార మాజీ సర్పంచ్, టీడీపీ జనరల్ సెక్రటరీ బడగల వెంకటప్పారావు మాట్లాడుతూ పథకంలో ప్రజాప్రయోజన పనులేవీ జరగడం లేదన్నారు. ఏడాదిలో ఒకే రకమైన పనులు జరుగుతున్నాయని, కనీసం ప్రజలకు సమాచారం లేదన్నారు. దీనిపై పీడీ సుధాకరరావు స్పందిస్తూ గత 18 ఏళ్లుగా ఉపాధి పనులు జరుగుతున్నాయని, ప్రజావేదికలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉపాధిలో ఎన్ని రకాల పనులున్నాయన్నది వివరాలు ఇవ్వాలని ఏపీవోకు ఆదేశించారు. వ్యవసాయానికి అనుసంధానం చేయాలని సర్పంచ్‌గా ఉన్న సమయంలో తీర్మానం ఇచ్చినా ప్రయోజనం లేకపోయిందని మాజీ సర్పంచ్ అన్నారు. అయితే మండల ప్రణాళికకు మరో ఐదు రోజులు సమయం ఉందని, మాజీ సర్పంచ్‌గా ఇప్పటికీ పనులు సూచించాలని పీడీ కోరారు. అనంతరం వారిమధ్య జీతభత్యాలు గురించి చర్చ వచ్చిన సందర్భంగా అధికారి చేసిన సరదా వ్యాఖ్యలకు వెంకటప్పారావు నొచ్చుకున్నారు. దీంతో ఆయన ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశాడు. ఇదే విషయమై ఎమ్మెల్యే గొండు శంకర్ పీడీ సుధాకరరావుతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిసింది.

అధ్వానం



శ్రీకాకుళం నగరంలోని ఇలిసిపురం జంక్షన్ వద్ద రైతు బజారుకు వెళ్లే మార్గంలో ఉన్న పలకల వద్ద రోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో ఆ మార్గంగుండా ప్రయాణాలు చేసే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ఆరేడు నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని వాహనదారులు, పాదచారులు వాపోతున్నారు. అందువలన తక్షణమే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారంతా విజ్ఞప్తి చేస్తున్నారు.

- శ్రీకాకుళం న్యూకాలనీ

తుప్పలు తొలగించరూ..?



శ్రీకాకుళం నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో దట్టంగా తుప్పలు పేరుకుపోవడంతో విషసర్పాలు, దోమలు, పందులు స్వైర్య విహారం చేస్తున్నాయి. తుప్పలు క్లియర్ చేయాలని సచివాలయంలో ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా కనీసం పట్టించుకోవడం లేదు. ఖాళీస్థల యజమానులకు నోటీసులిచ్చి తుప్పలు క్లియర్ చేస్తే ఇళ్లల్లో ఉండగలమని, లేకుంటే ఇబ్బందులు తప్పవని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవచూపాలని కోరుతున్నారు.

- శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

నిరుపయోగం



ప్రభుత్వ పథకాల ప్రచారం, ప్రజా ప్రయోజన ప్రకటనల కోసం ఎచ్చెర్ల రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన హోర్డింగ్ నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం దీనిని ఉపయోగించకపోవడంతో తుప్పుపట్టిపోతున్నాయి. అయితే ఇటువంటి వాటిని ప్రజా ప్రయోజనాలు కోసం ఉపయోగించుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

- ఎచ్చెర్ల క్యాంపస్

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు



ప్రథమ చికిత్సపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ప్రథమ చికిత్సపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంలో ప్రథమ చికిత్సపై 8 రోజుల శిక్షణ శనివారం ప్రారంభమైంది. దీనిలో భాగంగా రెడ్‌క్రాస్ ప్రోగ్రాం మేనేజర్ గొలివి రమణ, డాక్టర్ శ్రీకాంత్, కె.సత్యనారాయణలు ప్రథమ చికిత్సపై శిక్షణ ఇచ్చారు.

సీపీఆర్‌పై అవగాహన, విపత్తుల సమయాల్లో గాయలకు కట్టు కట్టుట, పాముకాటు, తేలుకాటు, గుండెపోటు వచ్చినవారికి ప్రథమ చికిత్స, కరెంట్ షాక్ తగిలిన వారికి, రోడ్డు ప్రమాదాల్లో గాయపడినవారికి ప్రథమ చికిత్స తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణలో పాల్గొన్న 30 మంది విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, ఏవో నర్సింగరావు, మేనేజర్ గుణాకరరావు, మేనేజింగ్ కమిటీ సభ్యులు ఎం.కల్యాణ్ చక్రవర్తి, కల్యాణ్, పి.చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి పూజలు



దూదివారి కోవెలలో తులసి, పూలమాలల అలంకరణలో వేంకన్న



నారాయణ తిరుమలలో వేంకన్న స్వామికి పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలో మొండేటివీధిలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు పట్నాల రామకృష్ణ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, అష్టోత్తర శతనామాలచే భక్తుల గోత్రనామాలతో పూజలు జరిగాయి. స్వామివారికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణలు చేపట్టారు. అలాగే గుజరాతీపేటలో ఉత్తరాంధ్ర తిరుమల కొండగా పేరుపొందిన నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వరుని ఆలయంలో శనివారం స్వామికి 14 కిలోల పూలతో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు భక్తుల గోత్ర నామాలతో అర్చనలు చేయించి, పూజలు నిర్వహించారు. శ్రీవేంకటరామానుజ సేవాదళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణ

స్థానిక చిన్న బజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి తులసి మాలలు, పూలమాలలతో అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి అష్టోత్తర శతనామాలతో అర్చనలు జరిపారు. భక్తులు స్వామివారిని అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.



మొండేటివీధిలో వేంకటేశ్వరస్వామికి పూజలు